# తెర వెనుక పాత్ర

★

రచన :
శ్రీ బచ్చు వీర్రాజు.

నేను స్థాపించిన "రాజ్ అండ్ రాజ్ ఎంటర్ ప్రైజెస్"కు ఆరోజే ప్రారంభోత్సవం. దానికి నా పూర్వపు మిత్రులైన గిరి, సతీష్, బలరాం లను హృదయపూర్వకంగా ఆహ్వానించాను. నేను వాళ్ళని కలుసుకోని సుమారు పది సంవత్సరాలు కావడంతో, నా మనసు ఎంతగానో ఉల్లాసంతో నిండి పోయింది!

ప్రారంభోత్సవానికి యింకా టైమ్ వుండటం వల్ల, బయట లాన్సులో, మిత్రుల మధ్య కూర్చున్నాను.

పిలుపు కోసం బయటకు వెళ్ళిన శ్రీమతి యింకా యింటికి రాక పోవడం నాలో కాస్త కంగారును రేకెత్తిస్తున్నా, మిత్రులను చూసి దానిని లోపలే గట్టిగా అణుచుకొన్నాను.

'జీవితంలో యింతటి అభ్యున్నతిని గాంచినందుకు, నాకు చాలా ఆనందంగా వుందరా'' అన్నాడు గిరి నన్ను చూసి

''అదంతా వాడి అదృష్టంరా'' నవ్వుతూ అన్నాడు బలరాం.

''యిటు నా అదృష్టానికీ, అటు ఓ మనిషిని ఐమీన్ పశువుని మనిషిలా తీర్చి దిద్దడానికీ, దోహదం చేసిన ఓ వ్యక్తిని మనం ముందుగా అభినందించాలిరా'' నవ్వుతూ అన్నాను బలరాంవైపు చూస్తూ.

''అదెలా? ఏమా కథ?'' కంగారుగా ప్రశ్నించాడు సతీష్.

''సింపుల్ గా చెబుతాను వినండి'' అంటూ నెమ్మదిగా గొంతు సవరించుకొని మొదలు పెట్టాను.

మనవూళ్లో మన మందరంను కలిసి చదివిన ఆ చదువు అయ్యాక, అవి నేను "వైజాగ్"లో చదువుతున్న రోజులు. అక్కడనాకు శేఖర్ అనే మిత్రుడుండేవాడు. జల్సాగా తిరుగుతూ, వేలకు వేలు తగుల బెడుతూవుండటం అతని హాబీ. ఆడవాళ్ళ మీద మోజుతో విపరీతంగా ఖర్చు పెట్టి వాళ్ళ ననుభవిస్తూ, మోజుతీరాక వాళ్ళను వదిలేసి వచ్చేవాడు. వాడు తిరగని ప్రదేశం, ఎరుగని బ్రోకర్లూ లేరు. జీవితాన్ని అతి తేలిగ్గా తీసుకొనేవాడు. ఏనాడూ పుస్తకం పట్టుకొనే వాడు కాదు...'' ఓ సారి ఆగి గేట్ వంక చూశాను.

''ఊ! తర్వాత? రెట్టించాడు ఆత్రుతగా సతీష్. తిరిగి మొదలు పెట్టాను ఉత్సాహంగా వాళ్ళవంక చూసి.''

''ఒకరోజు, హఠాత్తుగా ఎన్నికలహడావుడి మొదలైంది. నేనేనాడూ శేఖర్ తో, అతను జరిపే రాసకేళీ వినోదాలలో పాలుపంచుకోలేదు. చాలా మితంగా అతనితో ప్రవర్తించేవాడిని. శ్రీరామచంద్రునిలా వుండేనన్ను, తనలాగే ఓ గోపాలకృష్ణునిలా మార్చాలని ఎంతగానో ప్రయత్నించేవాడు. అయితే బీదరికంలో అలమటించే నేను, చదువు మీదనే దృష్టి నిలుపుతూ, అతన్ని తప్పించుకొని తిరిగే వాడిని. ఓసారి మళ్ళీ ఆపి గేట్ వంక చూశాను.

''ఏమైందిరా? మాటిమాటికీ అటువైపు చూస్తున్నావు?'' సీరియస్ గా ప్రశ్నించాడు బలరాం.

''ఏమీ లేదులే. చెబుతున్నాను. విను'' అంటూ మళ్ళీ చెప్పసాగాను.

"ఆ ఎన్నికల్లో ఫలానా అభ్యర్థి గెలుస్తాడని నేను, కాదు మరో అభ్యర్థి గెలుస్తాడని శేఖర్ పందెం వేసుకొన్నాము. పందెం ఏమిటంటే, ఓడినవాడు, గెలిచిన వాడి యొక్క మాటవిని ఓ రోజంతా వాడి ఆధీనంలో వుండాలి. వాడి లోపలి నైజాన్ని కనిపెట్టాను. అయినా నాలోని పట్టుదల కొద్దీ సై అన్నాను" గొంతు సవరించుకొన్నాను.

"ఊ! ఏమైంది?" నెమ్మదిగా ప్రశ్నించాడు గిరి.

కానీ నాఆశ తలక్రిందులైంది. శేఖర్ చెప్పిన అభ్యర్థి గెలిచాడు. నేను ఓడిపోయాను, నన్ను వెంటనే విజయనగరం లాక్కుపోయాడు. నేను బాధ పడుతూ అతని వెంట దారితీసాను. ఆ రాత్రి నన్ను వాడు ఓయింటికి తీసుకుపోయి, అక్కడవున్న వాళ్ళతో ఏదో మాట్లాడి, నన్ను చెయ్యి పట్టుకొని మేడమీదకు తీసుకెళ్ళి ఓ గదిలోకి తోశాడు. నేను మౌనంగా ఆగదిలో వున్న కుర్చీ మీద కూర్చున్నాను. "ఒరేయ్! ఈ రోజుతో నీ శ్రీరామావతారానికి స్వస్తి. కొంచెంసేపట్లో ఈ రోజే పట్టిన ఓ కొత్తసీతాకోక చిలుక నీ గదిలోకి రాబోతున్నది. మగవాడి వనిపించుకో బై" అంటూ క్రిందకి వెళ్ళిపోయాడు...ఆగి సిగరెట్ ముట్టించాను.

"యస్! నెక్స్ట్" ఉత్సాహంగా అన్నాడు గిరి.

వాడు చెప్పినట్లే గదిలోకి బలవంతంగా ఓ యువతి నెట్టబడింది. ఎవరో బయట తలుపులు బంధించేశారు కూడా. నాకు మతిపోయినట్లైంది. ఆ యువతి బంగారు విగ్రహంలా మెరిసి పోతోంది. స్త్రీలో యింత అందం దాగి వున్నదా? అని నాలో నేనే ఆశ్చర్య పోయాను. యింతలో ఆయువతి నన్ను చూసి కంగారు పడుతూ వచ్చి నా కాళ్ళ మీద పడిపోయి "నన్ను క్షమించండి. నన్ను బలవంతంగా నా స్నేహితురాళ్ళ నుండి విడదీసి యిక్కడకు లాక్కొని వచ్చి పడేశారు. నేనలాంటి దాన్ని కాను. మాది మర్యాదగల కుటుంబం" అంటూ





బనియన్ల తయారీలలో
మాదొక ప్రత్యేకత
అందుకే...
"టిప్ టాప్ బనియన్లు"
నాణ్యమునకు ప్రసిద్ధి చెందియున్నది.
"టిప్ టాప్"
బనియన్లు కొని ధరించి ఆనందించండి.
: తయారించువారు :
Tip Top Hosiery Mfrs.,
35-28, Dharapuram Road,
TIRUPUR - 638 604.

వెక్కి వెక్కి ఏడవసాగింది. ఒక్కసారిగా నా మనసు నీరై పోయింది...మళ్ళీ ఆగాను.

వేరీ, వేరీ యింట్రస్టింగ్ కేరీ ఆన్ అన్నాడు నవ్వుతూ బలరాం. "గ్రేట్ థ్రిల్" గట్టిగా అన్నాడు సతీష్.

ఆగండోయ్ మీ వెధవ కామెంట్స్, మీరూనూ విసుక్కున్నాడు గిరి.

వాళ్ళవంక చూసి, నవ్వుతూ తిరిగి కథని మొదలు పెట్టాను.

నేను వెంటనే నెమ్మదిగా ఆ యువతిని తట్టి, నీ కొచ్చిన భయం ఏమీ లేదు, నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు అంటూ అభయమిచ్చాను. ఆ యువతి ఒక్కసారిగా నిట్టూర్చి, అలాగే తెల్లవార్లూ, తలమోకాళ్ళ మీద పెట్టుకొని కూర్చునేవుంది. నేను అలాగే కుర్చీలోనే కూర్చుండి పోయాను. తెల్లవారింది, మాకు నిద్రన్నదే లేదు. హఠాత్తుగా బయట గడియ తీసిన చప్పుడైంది. ఒక్కసారిగా యిద్దరం లేచి నిలబడ్డాం. తలుపు తెరుచుకొంది. గుమ్మంలో శేఖర్ నిలబడ్డాడు. ఒక్కసారిగా ఆ యువతి "అన్నయ్యా" అంటూ శేఖర్ మీద విరుచుకు పడిపోయి ఘొల్లుమంది. శేఖర్ ఖిన్నుడై పోయాడు. అన్నయ్యా! నిన్న షార్ట్‌హాండ్ పరీక్షలు వ్రాసి వస్తుంటే నన్ను ఎవరో పిలుస్తున్నారని చెప్పి, నా ఫ్రెండ్స్ నుంచి విడదీసి కొంత మంది రౌడీలు నన్నిక్కడికి తీసుకు వచ్చి పడేశారు. పాపం! ఈయన ఎవరో నా మానం కాపాడారు... అంటూ స్పృహ తప్పి పడిపోయింది...తిరిగి మరో సిగరెట్ అందుకొన్నాను.

వాట్? నెక్స్ట్, కంగారుగా అన్నాడు గిరి.

(6)


చిత్రావారి అపూర్వ సృష్టి!!

KISANI

మీ వ్యవసాయాభివృద్ధికి




కిసాని

* మోటార్లు * పంపులు

* పంపుసెట్లు * జెట్ పంపులు

* ఫ్రాక్షన్ హెచ్. పి. మోటారులు

అత్యుత్తమమైనది.



: తయారించువారు :

Grams: "KISANI" Phone: 33159

CHITRA AGENCIES

37, Souripalaym Road,

COIMBATORE-641 028.

అంతే! శేఖర్ ఒక్కసారిగా తలదించుకొని నన్ను క్షమించమన్నట్లుగా నావంక చూశాడు. నేను నవ్వి వూరుకొన్నాను. డట్సాల్ ఆగి గేట్ దగ్గర కారు ఆగిన చప్పుడైతే లేచినిలడ్డాను.

మిత్రులంతా ఆత్రుతగా నావైపే చూడసాగారు. యింతలో కారులోంచి శ్రీమతి దిగుతూ వుండటం నాకళ్ళు విప్పారడం ఒక్కసారిగా జరిగాయి.

ఎవరావచ్చేవాళ్ళు? ఆత్రుతగా ప్రశ్నించాడు గిరి.

నేను నవ్వుతూ ఆవచ్చే స్త్రీమూర్తి ఆనాటి గదిలో నాచేత రక్షింపబడ్డ సునీత. ఇప్పుడు నా శ్రీమతి ఆ వెనకవచ్చే యువకుడు రాజు. ఇప్పుడు రాజశేఖర్. అలనాటి నా పందెం మిత్రుడు. యిప్పటికైనా అర్థమైందా? ఎవరివల్ల శేఖర్ పూర్తిగా మారిపోయిందీ, నా స్టార్ మారిందీ తెలిసిందా? ప్రశ్నించాను నవ్వుతూ.

మిత్రులంతా ఒక్కసారిగా ఖన్నులై పోయారు. యిద్దరి జీవితాల్లో మార్పు తెచ్చిన సునీతను చూస్తూ.


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 9-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.


అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.


## మాస్టర్ వెంకటేశ్వర్లు



ఎ. వి. యం. ప్రొడక్షన్స బ్యానరులో నిర్మాతలు శ్రీ కుమరన్ శ్రీ శరవణన్, శ్రీ బాల సుబ్రమణ్యం నిర్మిస్తున్న "పున్నమినాగు" చిత్రంలో మాస్టర్ వెంకటేశ్వర్లు తొలిసారిగా రవిపాత్రలో నటిస్తున్నాడు పెద్దపెద్ద నటీనటులు కూడా ఏనుగుతో నటించడానికి భయపడుతున్నప్పుడు, ఈ బాల నటుడు మాస్టర్ వెంకటేశ్వర్లు అందరూ ఆశ్చర్యపడేలా ఏనుగతో సునాయాసంగా నటించి అందరి మెప్పునూ పొందాడు.

ఇదే ఎ. వి. యం. ప్రొడక్షన్సవారు కొన్ని సంవత్సరాల వెనుక "కళత్తూర్ కన్నమ్మ" అనే తమిళు చిత్రాన్ని తయారించారు. ఆ చిత్రంలో ఒక బాల నటున్ని పరిచయం చేసారు. ఆ బాల నటుడు నేడు చిత్రసీమలో ఎవరెస్ట్ శిఖరాన్ని అందుకున్నాడు. అతడే అందాల నటుడు "కమలహాసన్".

అదేరీతిగా మాస్టర్ వెంకటేశ్వర్లు మరికొన్ని చిత్రాల్లో నటించి "కమలహాసన్" వలె చిత్ర ప్రపంచలో రాణించాలని ఆశీర్వదిస్తున్నాం. —సంపాదకుడు.